● న్యూస్ బాక్స్..

పుస్తె మట్టెల అందజేత

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని బరిగెల గూడెం కాలనీకి చెందిన కొండి మణెమ్మ కూతురు వందన వివాహం ఆదివారం జరిగింది. మా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్ తన వంతు సాయంగా పుస్తె మట్టెలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎగదండి స్వామి, కాలనీ వాసులు రమేష్, నాగరాజు, సతీష్, శ్రీనివాస్, సాయిలు తదితరులు ఉన్నారు.

సైకాలజిస్టు మండలి ఏర్పాటుకు కృషి

వేములవాడ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సైకాలజిస్టుల మండలి ఏర్పాటుకు కోసం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో పలువురు సైకాలిస్టులు కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ సైకాలజిస్టు మండలి ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్టు సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

రజక సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ఇల్లంతకుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామ మడలేశ్వరస్వామి రజక సంఘ అధ్యక్షుడిగా అంతగిరి శ్రీనివాస్ ఎన్నికయ్యాడు. సంఘభవనంలో ఆదివారం సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తాడూరి మల్లయ్య, ప్రధానకార్యదర్శిగా తాడూరి అనీల్, కోశాధికారిగా తాడూరి అనీల్, కార్యవర్గ సభ్యులుగా చంద్రశేఖర్, ప్రశాంత్, ప్రకాష్, లచ్చయ్య, రవి, అనంతగిరి పర్శరాంలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సభ్యుల అభివృద్ధికి కృషిచేస్తానని శ్రీనివాస్ తెలిపారు.

రైతు బీమాకు వేళాయె..



- 13వ తేదీ వరకు అవకాశం
- 14న పాలసీ రెన్యూవల్
- రైతువేదికల వద్ద దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాట్లు
- ప్రీమియం డబ్బులు చెల్లించనున్న ప్రభుత్వం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అన్నదాతల కుటుంబాలకు ధీమాగా మారిన రైతుబీమాకు వేళయింది. కొత్త పట్టాదారులు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఎనిమిదోసారి ఎల్ఐసీ ద్వారా ఫార్మర్స్ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి రైతులను చేర్చే ప్రక్రియ మొదలైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం 80,185 మంది రైతులు బీమాలో నమోదై ఉన్నారు. ఈసారి కూడా ప్రభుత్వం రైతు కుటుంబాలకు ధీమా కల్పించేందుకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించి అమలు చేస్తోంది.

● 60 ఏళ్లు నిండిన రైతులు తొలగింపు

రైతు బీమాలో చేరడానికి 18నుంచి 59ఏళ్ల వయస్సు ఉన్న వారు అర్హులు. గతంలో ఈ పథకం పరిధిలో ఉన్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. గతంలో పాలసీలో ఉన్న వారందరి డేటాను పరిశీలించి తిరిగి పాలసీని పునరుద్ధరించనున్నారు. ఇందులో 60సంవత్సరాలు నిండిన రైతులను తొలగిస్తారు. దీంతోపాటు రైతు బీమా నమోదు చేసుకున్న రైతులు వారి నామినీ ఏదైనా కారణంతో మృతిచెందినా, కొత్త నామినీలను నమోదు చేసే అవకాశం కల్పించింది. కొత్తనామినీ ఆధార్, బ్యాంక్ ఖాతా పాటు ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

● కొత్త పట్టాదారులకు అవకాశం

రైతు బీమా పాలసీలో కొత్త పట్టాదారుల అవకాశం కల్పిస్తూ దరఖాస్తులను ఈనెల 13తేదీ వరకు వ్యవసాయ అధికారులకు అందించాలి. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో దరఖాస్తులు చేసుకోవచ్చు. కొత్త, పాత పట్టాదారులు, ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారుల వివరాలను గ్రామాల వారీగా బీమాపోర్టల్‌లో నమోదుచేసే ప్రక్రియను వ్యవసాయ శాఖ నాలుగు కేటగిరీలుగా విభజించింది. ప్రాధాన్య క్రమంలో పాలసీ నమోదును పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టింది. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన వారికి కేటగిరీ ప్రాధాన్యం ఇస్తూ వారి వివరాలను బీమా పోర్టల్‌లో నమోదు చేయడానికి ఈనెల 13వతేదీ వరకు పూర్తిచేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఐదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి కలిగిన..

(మిగతా 8లో..)

జిల్లాలో భూములు, రైతులు..

మండలం	రైతులు	ఎకరాల్లో భూమి
రుద్రంగి	2,021	6173.99
చందుర్తి	9,037	20485.94
వేములవాడరూరల్	7,099	16086.33
బోయినపల్లి	8,152	19316.41
వేములవాడ	6,446	14146.04
సిరిసిల్ల	3,641	5287.59
కోనరావుపేట	11,979	25436.59
వీర్నపల్లి	2,787	5077.68
ఎల్లారెడ్డిపేట	10,223	20985.20
గంభీరావుపేట	11,053	20358.17
ముస్తాబాద్	11,860	28672.67
తంగళ్ళపల్లి	12,774	24193.96
ఇల్లంతకుంట	13,811	36936.59
మొత్తం	1,10,883	2,43,157.16

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

● కిక్కిరిసిన వేములవాడ బస్టాండ్



వేములవాడ ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు

వేములవాడ టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ బస్టాండులో బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు, భక్తులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. వేములవాడకు నిత్యం వేలసంఖ్యలో భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా ఆలయానికి వస్తున్నారు. అంతేకాకుండా రాఖీ పండగ సందర్భంగా స్వగ్రామాలకు తరలివచ్చిన ప్రయాణికులు తిరిగి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండుకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు, ప్రయాణికులతో బస్టాండు రద్దీగా కనిపించింది. బస్సులు సరైన సమయానికి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

బస్ షెల్టర్ దారి బురదమయం



బురదమయంగా మారిన బస్‌షెల్టర్ దారి

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట బస్ షెల్టర్ దారి బురదమయంగా మారింది. వర్షం పడిన ప్రతీసారి బస్‌షెల్టర్‌లోకి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడతారు. బస్‌షెల్టర్‌లోకి ఎడమ వైపు నుంచి వెళ్లేటప్పుడు బురద గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షాకాలం వచ్చిందంటే చాలు బస్ షెల్టర్ దారి బురదమయంగా మారుతోంది. సంబంధింత అధికారులు బురద గుంతలను పూడ్చి మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేస్తోందని, ప్రభుత్వ పథకాల లబ్ధికి రేషన్‌కార్డు కీలకమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మణికంఠ ఫంక్షన్ హాలులో అధికారులు నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హాజరై మాట్లాడారు. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల తొలగింపు, నమోదును చేసుకునే అవకాశం ఉందని అన్నారు. మండలంలో మొత్తం 1,494 నూతన రేషన్ కార్డులను జారీ చేశామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న అనేక సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు ప్రామాణికమని అన్నారు. రేషన్‌కార్డు లేని నిరుపేదల దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి వారికి అందజేస్తామని కలెక్టర్ అన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరా బేగం, పౌర సరఫరాల శాఖ డీఎం రజిత, పౌర సరఫరాల శాఖ అసిస్టెంట్ అధికారి శ్రీలత, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, ఆర్ఐ శ్రవణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, శంకర్, రవీందర్, నాయకులు సాహెబ్, గిరిధర్‌రెడ్డి, బాబు, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, రాజేందర్, రవీందర్, శ్రీనివాస్, బాలయ్య, విజయ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, బాల్‌రెడ్డి, వివిధ శాఖ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డును అందజేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం

పేదల ఆత్మగౌరవం నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



చెక్కపల్లిలో లబ్ధిదారుతో మాటాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవం నిలబెట్టడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చెక్కపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదింటి సొంతింటి కల నెలరవేర్చుతున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటికే బేస్‌మెంట్ పూర్తి చేసుకున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇంటిని కూడా పూర్తి చేయలేదన్నారు. నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చెర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు అడ్డిక జైపాల్‌రెడ్డి, బొడ్ల రాములు, సోయినేని కరుణాకర్, రేమాల ప్రశాంత్, సోమినేని బాలు పాల్గొన్నారు.

● మాట ఇచ్చి... నిలబెట్టుకుని..

వేములవాడ టౌన్: ఓ నిరుపేద మహిళ తనకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేదని వారం రోజుల క్రితం ఆది శ్రీనివాస్‌కు మొరపెట్టుకుంది. వారం రోజుల్లో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు ఇప్పించి మహిళ ఇంటికి వస్తానని మాటఇచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తన మాటను నిలబెట్టుకున్నారు. వేములవాడ పట్టణానికి చెందిన పల్లపు శారద 17వ వార్డులో ఓ పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. రేషన్‌కార్డు ఇప్పించిన విప్ శారద ఇంటికి వెళ్లాడు. పూరిగుడిసే ఉండటంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తానని మహిళకు హామీ ఇచ్చారు.



వేములవాడలో శారద కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

- స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం
- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు

7



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

కురిసిన వర్షం.. పంటలకు జీవం

- జిల్లాలో 24.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు



సిరిసిల్లలో రోడ్డుపై పారుతున్న వర్షం నీరు

సిరిసిల్ల ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షంతో రైతులకు ఊరట లభించింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఆదివారం ఉదయం వరకు 24.3 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. పత్తి, మొక్కజొన్న పంటలకు మళ్లీ జీవం వచ్చింది. జిల్లాలో అత్యధికంగా ఇల్లంతకుంట మండలంలో 61.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అతి తక్కువగా వేములవాడ రూరల్ మండలంలో 1.9మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో గంభీరావుపేటలో 58.3 మిల్లీమీటర్లు, ముస్తాబాద్‌లో 50.5 మిల్లీమీటర్లు, సిరిసిల్లలో 29.4 మిల్లీమీటర్లు, తంగళ్ళపల్లిలో 27.6 మిల్లీమీటర్లు, చందుర్తిలో 25.0 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 23.4 మిల్లీమీటర్లు, ఎల్లారెడ్డిపేటలో 15.7 మి ల్లీమీటర్లు, వేములవాడలో 9.8 మిల్లీమీటర్లు, బోయిన్‌పల్లిలో 5.5 మిల్లీమీటర్లు, వీర్నపల్లిలో 4.4 మిల్లీమీటర్లు, కోనరావుపేటలో 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సిరిసిల్ల జిల్లాకేంద్రంలో పాత బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది.

ఇళ్లలోకి చేరిన నీరు..

తంగళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): వర్షం పడితే ఇళ్లలోకి నీరు చేరి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామం ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఉన్న ఇళ్లలోని నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారు. బాధితుడు కరీం మాట్లాడుతూ వర్షం పడితే జాగారం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ కుటుంబంలో చిన్న పిల్లలు ఉన్నారని వర్షం నీరు ఇళ్లలోకి రావడంతో తరుచూ జ్వరాలబారీన పడుతున్నామని అన్నారు. పాములు, విష పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని, వర్షం పడితే భయం గుప్పిట్లో బ్రతుకుతున్నామన్నారు. పొలాల కోసం ఇష్టారాజ్యంగా పైపులైన్లు వేసుకున్నారని ఆరోపించారు. పైప లైన్లు తొలగించి ఇళ్లలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



వర్షపు నీటిలో పిల్లలతో ఇబ్బందులు పడుతున్న కుటుంబం

కొడుకు మరణం తట్టుకోలేక.. తండ్రి ఆత్మహత్య


బాలేశ్వర్‌రెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామానికి చెందిన బాలేశ్వర్‌రెడ్డి(52) అనేవ్యక్తి కొడుకు మరణం తట్టుకోలేక మనోవేద నతో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివ రాల ప్రకారం.. గూడు బాలేశ్వర్‌రెడ్డి, మమత దంపతల కుమారుడు సంకీర్త్ క్యాన్సర్ వ్యాధితో రెండేళ్ల క్రితం చనిపోయాడు. కొడుకు మరణం తట్టుకోలేక తరుచుగా బాలేశ్వర్‌రెడ్డి బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్రమక్రమంగా క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో మనస్తాపం చెందిన బాలేశ్వర్‌రెడ్డి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బాలేశ్వర్‌రెడ్డి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేశ్(ఫైల్)

ముస్తాబాద్, అగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ (27) అనే యువకుడు శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం పోతుగల్ గ్రామానికి చెందిన కొప్పు నరేశ్ ముస్తాబాద్‌కు ద్విచక్రవాహనంపై వచ్చి పెట్రోల్ పోసుకొని వెళ్తున్నాడు. హనుమాన్ టెంపుల్ నుంచి వెళుతుండగా ఎదురుగా రోడ్డుపై పార్కింగ్ చేసిన బోర్‌వెల్ లారీ డ్రైవర్ ఎలాంటి ఇండికేటర్స్ వేయకుండా రోడ్డు మీద పార్కింగ్ చేశాడు. ఈక్రమంలో బోర్‌వేల్ లారీని నరేశ్ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. నరేశ్ తలకు, కడపులో తీవ్రగాయాలుగా కాగా సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టున ఎస్సై తెలిపారు.

రాజస్థాన్‌కు చెందిన వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని కొత్తపల్లి వద్ద వినాయక విగ్రహాల తయారీ కేంద్రంలో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన వివాహిత శారద(22) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వినాయకుడి విగ్రహాలు తయారుచేసేందుకు కూలగా శారద, ఆమెభర్త స్థానికంగా గదిలో ఉంటున్నారని, శనివారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని పేర్కొన్నారు.. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. శారద ఆత్మహత్యకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీగదిలో భద్రపరిచారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోంపల్లి శివారులో కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు అతి వేగం వల్ల ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు గాయాలైన యువకుడిని 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై పెద్దపల్లి రూరల్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మేమేమి చేశాము పాపం..

- నాలుగు నెలలుగా కళాకారులకు అందని పెన్షన్
- భారమవుతున్న కుటుంబపోషణ
- ప్రభుత్వం, నాయకులు ఆదుకోవాలని వేడుకోలు


చిందు యక్షగాన కళాకారులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): సంగీతాన్ని అందించే వాయిద్యాలు మూగ బోయాయి. తాళాలు శృతి తప్పాయి. రక్తికట్టించే గజ్జెల సవ్వడి ఆగిపోయింది.. గదలు, బా ణాలు, ఖడ్గాల విన్యాసాల గతులు తప్పాయి. నాట్యం, పాట, నాటకం, పలు కళలు ఆహార్య అభినయాలు అంతరించిపోయాయి. ఉమ్మడి జిల్లాలో 55 సంవత్సరాలు దాటిన సుమారు 25 కళలకు చెందిన పెన్షన్‌కు అర్హులైన దాదాపు 50 నుంచి 60 మంది కళాకారులున్నారు. వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యక్షగానంతో పాటు వీధి, గంటె భాగవతులు డప్పు, ఒగ్గు, బుర్ర, హరికథలు వంటి 25 కళలకు చెందిన కళాకారులకు నాలుగు నెలలుగా పెన్షన్ అందడం లేదు. దీంతో కుటుంబ పోషణ కోసం పలువురు కళాకారులు కూలీలుగా మారారు. కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడ్డారు. మే వరకు 3 నెలలకొకసారి 3 వేల చొప్పున పెన్షన్ ఇచ్చారు. తరువాత పెన్షన్ నిలిచిపోవడంతో కళాకారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

● కళాకారుల డిమాండ్లు

ప్రభుత్వం తరుఫున కార్యక్రమాలను ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని కళాకారులు కోరుతున్నారు. సంఘ భవనాన్ని నిర్మించి పెన్షన్ ప్రతినెలా అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల మంజూరు చేయాలంటున్నారు. కొత్త ప్రభుత్వం, నాయకుతోనైనా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం ఆదుకోవాలి...

- గజవెల్లి కిష్టయ్య, చిందు యక్షగాన కళాకారుడు



ఒకప్పుడు మా యక్షగాన, కళా ప్రదర్శనలతో కుటుంబంలోని అందరికి ఉపాధి దొరికింది. ఇప్పుడు అదరణ కరువయింది. మమ్మల్ని ముఖ్యమంత్రి ఆదుకోవాలి.

ఆసరాగా నిలవాలి...

- ఈరు రాజమల్లయ్య, ఒగ్గు కళాకారుడు



మేం ఒగ్గు కథ చెబుతాం. కళాకారులకు సకాలంలో పెన్షన్ అందజేసి ఆసరాగా నిలవాలి. ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి.

మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువు మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ


ఆసుపత్రిలో రోదిస్తున్న శిశువు తల్లి ప్రేమలత, కుటుంబ సభ్యులు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున నవజాత శిశువు మృతిచెందింది. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మహరాజు ప్రేమలత పురిటినొప్పులతో గురువారం జగిత్యాలలోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి వచ్చింది. శుక్రవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. శనివారం నుంచి బాబు సరిగా పాలు తాగడం లేదని విధులు నిర్వ హిస్తున్న నర్సుల వద్దకు వెళ్లితెలిపినప్పటికీ వారు నిర్లక్ష్యం వహించడంతో శిశువు అపస్మారక స్థితి లోకివెళ్లి మృతి చెందినట్లు బంధువులు ఆరో పించారు. వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి ఉంటే తనబిడ్డ దక్కేవాడని తల్లి ప్రేమలత రోదిస్తూ తెలిపింది. విధుల్లో నిర్లక్ష్యం వహించిన నర్సులపై చర్య తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. కాగాశిశువుకు పాలు పట్టించిన తర్వాత భుజంపై వేసుకోకుండా నిద్రపుచ్చడం వల్లనే శిశువు మృతి చెందినట్లు విధుల్లో ఉన్న నర్సులు తెలిపారు.


మృతిచెందిన శిశువు

● విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం...

నవజాతశిశువు మృతి సంఘటనపై విచారణ జరిపిచర్యలు తీసుకుంటామని మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ జి. కృష్ణమూర్తి తెలిపారు. శిశువు ఆరోగ్య పరిస్థితిపై అతడి బంధువులు వచ్చిచెప్పినప్పటికీ విధుల్లోఉన్న వైద్యుడికి సమాచారం అందించకుండా నిర్లక్ష్యం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి


రామస్వామి(ఫైల్)

కోనరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన కుంటెల్లి రామస్వామి(40) అనేరైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందాడు. గ్రామస్థులకథనం ప్రకారం గ్రామానికి చెందిన రామస్వామి ఉదయం తన పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ స్టార్టర్ బావిపక్కనే ఉండడంతో కరెంటు పెట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడ్డాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం వెళ్లిన రామస్వామి రాత్రి వరకు కూడా ఇంటికి రాకపోవడంతో భార్య కొమురవ్వ, కుమారుడు అరవింద్ అనుమానం వచ్చి బావి వద్దకు వెళ్లి చూసేసరికి బావిలో శవమై కనిపించాడు. ఈ విషయమై కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించడంతో ఏఎస్‌ఐ తిరుమల్ సంఘటనస్థలానికి చేరుకొని మృతదేహాన్ని గ్రామస్తుల ద్వారా బయటకు తీయించి ప్రమాదానికి గల కారణాలు పరిశీలిస్తున్నారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే కరీంనగర్ సుభాష్‌నగర్‌కు చెందిన కామారపు అనిల్‌కుమార్(36) ఆదివారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎల్‌ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామా రపు అనిల్‌కుమార్ సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కాని స్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అనిల్ కుమార్ తన సన్నిహితులకు కొంతడబ్బు అప్పుగా ఇచ్చాడు. డబ్బును తిరిగి ఇవ్వాలని సన్నిహితులను కోరగా ఇవ్వకపోగా వేదింపులకు గురి చేశారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్‌కుమార్ జూలై31న అలుగునూర్ శివారులో పురుగుల మందు తాగి ఇంటికి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు అనిల్‌కుమార్‌ను చికిత్సకోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం అనిల్ కుమార్ మృతిచెందాడు. మృతుడు అనిల్‌కుమార్ తండ్రి కామారపు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామానికి చెందిన మేకమల్ల ఐలయ్య అనేవ్యక్తి తనను అదే గ్రామానికి చెందిన లచ్చయ్య కులం పేరుతో దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దిగువ కొండగట్టులో వదినపై దాడి చేసిన వ్యక్తిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. జుంగోని వెంకటేశ్ అనే యువకుడు వదినతో తరచూ గొడవ పడడమే కాకుండా ఆదివారం ఇంట్లోకి వచ్చి దూషిస్తూ దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయగా వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రామాల సరిహద్దు వివాదం

- బోర్డుల తొలగింపు వివాదాస్పదం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఏళ్లుగా నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య పంచాయితీ


మల్యాల సీఐ రవికి ఫిర్యాదు చేస్తున్న రామన్నపేటవాసులు

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని నూకపల్లి, రామన్నపేట గ్రామాల మధ్య సరిహద్దు వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతుండగా తాజాగా ఆదివారం రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. నూకపల్లి, రామన్నపేట గ్రామాలు 1978లో ఏర్పడగా నూకపల్లి గ్రామాన్ని రెవెన్యూ పంచాయతీగా పేర్కొన్నారు. నూకపల్లి రెవెన్యూ పంచాయతీ గ్రామం కింద నూకపల్లితో పాటు రామన్నపేట చేర్చారు. ఇక్కడే రెండుగ్రామాల మధ్య పంచాయితీ ఏర్పడింది. కరీంనగర్-జగిత్యాల మార్గం దీని పరిధిలోనే ఉండగా మల్యాల క్రాస్‌రోడ్డు నుంచి రాజారం వరకు విలువైన భూములు ఉన్నాయి. దీంతో గతంలో సర్వే నంబర్ల ఆధారంగా రెండు గ్రామాలకు కేటాయించుటకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంకు మల్యాలవైపు రామన్నపేట, నూకపల్లి వైపు నూకపల్లి గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో సర్వే నంబర్ల ఆధారంగా ఇంటి అనుమతులు ఇస్తున్నారు. అయితే తాజాగా మల్యాల క్రాస్ సమీపంలోని పెట్రోల్ పంప్ యజమాని పంప్ పక్కనే కల్యాణ మండపం నిర్మించి ఆదివారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసుకొని బోర్డుపై రామన్నపేటగా పేర్కొన్నాడు. దీంతో నూకపల్లి గ్రామస్థులు శనివారం అక్కడకు వెళ్లి తమ పరిధిలో ఉన్నందున రామన్నపేట గ్రామ పేరు తొలగించాలని అనడంతో ఆ పేరు తొలగించి మల్యాల క్రాస్ రోడ్డుగా పేర్కొన్నారు. రామన్నపేట పేరు తొలగింపుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆదివారం గ్రామస్థులు ప్రారంభోత్సవ కార్యక్రమం వద్దకు వెళ్లి యజమానితో గొడవకు దిగారు. నిర్మాణానికి తమ గ్రామపంచాయతీ అనుమతి ఉన్నందున రామన్నపేట పేరు మార్చాలని యజమాని కొత్త సురేశ్‌ను కోరారు.

తనకు రెండు రోజులు అవకాశం ఇవ్వాలని కోరడంతో అక్కడ నుంచి వెళ్లారు. అంతకు ముందు బోర్డు తొలగింపుపై నూకపల్లి గ్రామస్థులపై రామన్నపేట వాసులు మల్యాల సీఐ నీలం రవికి ఫిర్యాదు చేశారు. భయభ్రాంతులకు గురి చేసి బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమీపంలోని సూపర్‌మార్కెట్, వీఆర్‌కే కళాశాల పేర్లు కూడా మార్చాలని నూకపల్లి గ్రామస్థులు హెచ్చరించారని రామన్నపేట వాసులు సీఐకి వివరించారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

● 30 కార్ల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ తొలగింపు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు ఆదివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. కార్లకు బిగించుకున్న బ్లాక్ ఫిల్మ్‌లను టింట్ మీటరుతో తొలగించారు. 30కార్ల యజమానులకు జరిమానా విధించారు. అనంతరం వాహనాల యజమానులకు కరీంనగర్ ట్రాఫిక్‌సీఐ కరీం ఉల్లాఖాన్ కౌన్సెలింగ్ నిర్వహిచారు. ట్రాఫిక్ నిబంధనల ప్రకారం కార్లు, ఇతర వాహనాల అద్దాలపై బ్లాక్ ఫిల్మ్ వేయొద్దన్నారు. కార్ల అద్దాలు షోరూం నుంచి వచ్చిన విధంగానే ఉండాలని, అదనపు ఫిల్మ్‌లు వేయరాదని అన్నారు. ట్రాఫిక్‌నిబంధనలు ఉల్లంఘించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదాలు, నేరఘటనలు నియంత్రించేందుకు ముందస్తుగా నిర్వహిస్తున్న తనిఖీలు, ఇతరచర్యలకు నగర ప్రజలు సహకరించాలని కోరారు. ఆర్‌ఐ కుమారస్వామి, ఎస్సై ఇషాక్ అహ్మద్, ఆర్‌ఎస్సై సురేష్ పాల్గొన్నారు.


బ్లాక్ ఫిల్మ్ తొలగించి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కరీం ఉల్లఖాన్, ఆర్‌ఐ కుమారస్వామి

మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన


వాటర్ ట్యాంక్ ఎక్కిన తిప్పని శ్రావణ్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని జాఫర్‌ఖాన్ పేట గ్రామంలో ఆదివారం సాయంత్రం మాజీ వార్డు మెంబర్ తిప్పని శ్రావణ్ గ్రామానికి మంచినీరు ఇవ్వడం లేదని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో నిండా నీరు ఉన్నా గ్రామానికి మంచినీరు ఇవ్వక ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రామస్థులు వాటర్ ట్యాంక్ దిగిరావాలని కోరగా, శాంతించిన ఆయన దిగిరావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లి గ్రామశివారు నుంచి మట్టిని తరలిస్తున్నారంటూ రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తరలిస్తుండగా, వాటిని సీజ్‌చేసినట్లు తహసీల్దార్ కనుకయ్య తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెట్‌పల్లి ఏఎంసీ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

- పెద్దఎత్తున గోనె సంచులు దగ్ధం
- రూ.30 లక్షల ఆస్తి నష్టం

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోని గోదాంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు మూడు లక్షల గోనె సంచులు దగ్ధమై రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగింది. మార్కెట్ యార్డులోని గోదాంను సివిల్ సప్లయిస్ వారు అద్దెకు తీసుకొని 2018 సంవత్సరం నుంచి ఐదు లక్షలకు పైగా గోనె సంచులను నిలువ చేశారు. ఆదివారం ఉదయం గోదాంలో నుంచి పొగ రావడాన్ని స్థానికులు గమనించి గోదాం ఇన్‌చార్జి బూరం సురేశ్‌తోపాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మంటలు భారీగా వ్యాపించడంతో జగిత్యాల, నిర్మల్, భీంగల్, కమ్మర్‌పల్లి కేంద్రాల నుంచి అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పడానికి యత్నించారు. అయినా గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎల్‌సీఎస్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్‌లు ఆధ్వర్యంలో మూడు ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలుకొట్టి దగ్గమవుతున్న గోనె సంచులను బయటకు తీసి ఆర్పి వేశారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకురావడానికి తొమ్మిది గంటలపాటు శ్రమించారు. సంఘటన స్థలాన్ని ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రాములు, తహసీల్దార్ నీత, సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ పరిశీలించారు. సుమారు రూ.30 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉంటుందని సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్ తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియకపోవడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రతి సంవత్సరం కోట్లల్లో ఆదాయం వచ్చే మార్కెట్ యార్డుకు కనీసం వాచ్‌మెన్ కూడా లేకపోవడంపై ఏఎంసీ అధికారుల నిర్లక్షం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేశారు.


గోదాంలో దగ్ధమవుతున్న గోనె సంచులు


మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పేందుకు ఎక్స్‌కవేటర్‌తో గోడను కూల్చుతున్న సిబ్బంది

పాన్‌షాప్ నిర్వాహకుడిపై జులాయిల దాడి

● అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోల్‌సిటీ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): షాపు ముందు సిగరెట్ తాగవద్దన్నందుకు నలుగురు జులాయిలు పాన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి చేసిన ఘటన ఆదివారం గోదావరిఖని మార్కండేయకాలనీ జంక్షన్‌లో జరిగింది. శ్యామ్ అనే పాన్‌షాపు నిర్వాహకుడి వద్దకు వచ్చిన నలుగురు యువకులు సిగరెట్ తీసుకుని షాపువద్ద తాగుతుండగా అతడు అడ్డు చెప్పాడు. దీంతో కౌంటర్‌లోని డబ్బులు లాక్కున్న యువకులు అతనిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన ఇతర షాపుల వారిపై కూడా దౌర్జన్యానికి పాల్పడుతూ పిడి గుద్దులు గుద్దారు. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గొడవ జరుగుతున్నా స్థానికులు స్పందించలేదు. పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఇంద్రసేనారెడ్డి, పోలీసులు వెంటనే స్థలానికి చేరుకుని గొడవకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. వారు మద్యం మత్తులో ఉన్నట్టు స్థానికులు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎల్‌ఎండీ పోలీసులు పట్టుకున్నారు. మానకొండూర్ మండలం లింగాపూర్‌లోని వాగునుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను అలుగునూర్ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. అదేవిధంగా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో గల మోయ తుమ్మెద వాగు నుంచి సైతం అనుమతి లేకుండా ఇసు కను తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్‌ను కొత్తపల్లి శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి యాజమానులు తాళ్ల సంతోష్, గుంటక రాజు, డ్రైవర్లు తాళ్ల ప్రశాంత్, న్యాలం చందుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి శివారులో చిరుత పులి సంచారం

● అప్రమత్తంగా ఉండాలంటున్న అటవీ అధికారులు

ధర్మపురి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ శివారులో గల పోచంపుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచారం కలకలం సృష్టించింది. రెండు రోజుల క్రితం వ్యవసాయ పనులకు వెళ్లిన ఒక వ్యక్తికి చిరుత పులి పిల్ల కనిపించడంతో భయంతో పరుగులు తీశాడు. పట్టణ శివారులో గల పోచంపంపు, ఇతరత్రా వ్యవసాయ భూములకు పెట్రోల్ బంక్ పక్క నుంచి ఎడ్ల బండ్ల దారి, కమలాపూర్ దారి గుండా నిత్యం అనేక మంది రైతులు, వ్యవసాయ కూలీలు పనులకు వెళ్తుంటారు. వ్యవసాయ పనులకు వెళ్లిన వ్యక్తికి చిరుత పులి కనిపించడంతో స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు ఆదివారం పరిసర ప్రాంతాల్లో కాళ్ల పాద ముద్రల కొలతలు తీసి చిరుత పులి అడుగులుగా భావిస్తున్నట్లు తెలిపారు. పోచంపంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి సంచరించినట్లు కొందరు వ్యక్తులు అటవీ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు నేరెళ్ల అటవీ బీట్ అధికారి జీవన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం వెళ్లి చిరుత పులి సంచరించిన ప్రదేశాల్లో కాళ్ల వేలి ముద్రల కొలతలు తీసుకున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలని ఆయన అన్నారు. సాయంత్రం 4 గంటల లోపుగా పనులు ముగించుకుని రైతులు, వ్యవసాయ కూలీలు తిరిగి ఇంటికి రావాలని ఆయన సూచించారు.


ధర్మపురి శివారులో గల పోచం పుంపు వ్యవసాయ భూముల్లో చిరుత పులి పాద ముద్రల కొలతలు తీస్తున్న అటవీ శాఖ అధికారులు


ప్రకృతి రమణీయంగా.. కొండలరాయుడి కోట..


కొండలరాయుడి కోట


రాతి కట్టడాలలో కొలను

● కొండగట్టులో భక్తులను ఆకట్టుకుంటున్న రాతి కొండ

మల్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి వెనకాల వాయువ్యం వైపున ఎత్తయిన గుట్టలు, పచ్చని చెట్లు, చుట్టూ ప్రకృతి రమణీయత మధ్య గల కొండలరాయుడి రాతి కోట చారిత్రాత్మకమైంది. వందల ఏళ్ల చరిత్ర గల ఈ రాతి కోటను మల్యాల మండలం మానాలకు చెందిన బల్మారి కొండలరాయుడు నిర్మించాడని చరిత్రకారులు చెబుతారు. వివాహమైన చాలా కాలం తర్వాత దంపతులకు అంజన్న పుణ్యఫలంగా బల్మారి కొండలరాయుడు జన్మించాడని స్థానికులు పేర్కొంటారు. బల్మారి కొండలరాయుడు ఆలయం వెనకాల రాతి కోటతో పాటు నీటి కొలను నిర్మించినట్లు స్థానికులు చెబుతారు. రాతి కొండను సందర్శించే భక్తులకు బండ రాళ్లపై గుర్రపు స్వారీ చేసిన గుర్రపు అడుగుల డెక్కలు, బురుజు, కోటగోడలు, కొలను చూడవచ్చు. అంజన్న దర్శనానికి వచ్చే భక్తులు కొండలరాయుడి కొండకు వెళ్లి అక్కడి నుంచి ప్రకృతి సుందర దృశ్యాలను తిలకిస్తుంటారు. ఎత్తైన ప్రాంతంలో గల కొండలరాయుడి కోటను సందర్శించే భక్తులు అక్కడి నుంచి పచ్చని గుట్టలు, చెట్ల మధ్య గల కరీంనగర్-జగిత్యాల రహదారి, రైల్వే మార్గం, వరదకాలువ దృశ్యాలను చూస్తూ ఫొటోలు దిగుతుంటారు. కొండలరాయుడి కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే చాలా మంది ప్రకృతి ప్రేమికులు వచ్చే అవకాశం ఉంది.


బండపై గుర్రపు డెక్కల గుర్తులు

ఖోఖో క్రీడాకారులు..
అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

● ఉమ్మడి జిల్లాలో ఖోఖో క్రీడాభివృద్ధికి కృషి
● జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరందర్‌రెడ్డి
● ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలు


ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, అందుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఆదివారం జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సీనియర్ ఖో-ఖో పోటీల ముగింపు సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోఉన్న క్రీడాకారుల ప్రతిభకు కొదవలేదని, కావాల్సింది ప్రోత్సాహమేనని అన్నారు. నిత్య శిక్షణ, క్రమశిక్షణతో రాణిస్తే భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగే అవకాశముందన్నారు. జిల్లా ఖో-ఖో క్రీడారంగానికి పూర్వ వైభవం తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో ఖో-ఖో అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తానన్నారు. జిల్లాలో రాష్ట్ర, జాతీయ స్థాయి ఖో-ఖో క్రీడలను నిర్వహించేందుకు కృషిచేయనున్నట్లు చెప్పారు. విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలన్నారు. వివిధ సంస్థల్లో ఉద్యోగులుగా చేరేందుకు క్రీడాకారులకు మంచి అవకాశాలు ఉన్నాయన్నారు.

జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి తెలంగాణ ఖో-ఖోఅసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.మహేందర్‌రావు మాట్లాడుతూ ఉమ్మడిజిల్లా నుంచి 130మంది క్రీడాకారులు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్, 30మంది సీనియర్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. అంతకుముందు సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరందర్ రెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో భారత మహిళల ఖో-ఖో జట్టు కోచ్ నరేష్, కరీంనగర్ జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పోలీసు సీఐ కుమారస్వామి, వివిధ జిల్లాల ఖో-ఖో సంఘాల ప్రధానకార్యదర్శులు డాక్టర్ వేల్పుల కుమారస్వామి, లక్ష్మయ్య, డాక్టర్ రవీందర్, ఎస్‌కే మోయినుద్దీన్, సూర్యప్రకాశ్, జిల్లా పెటాఅధ్యక్ష, కార్యద ర్శులు బాబు శ్రీనివాస్, ఆడెపు శ్రీనివాస్, పెద్దపల్లి పెటా అధ్యక్షుడు డాక్టర్ వేల్పుల సురేందర్, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారులు గెల్లు మధుకర్, వెంకటేశ్, రాజు, డాక్టర్ నవీన్, జిల్లా ఖో-ఖో సంఘంప్రతినిధులు కట్ట సంతోష్, శేఖర్, శివకుమార్, రాజబాబు, మధుసూదన్, శ్రీలత, జ్యోతి, సంధ్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన వరద

● ప్రాజెక్టులోకి 28,147 క్యూసెక్కుల నీరు రాక


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

జగిత్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు రావడం ఆదివారం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు బాబ్లీ గేట్లు ఎత్తివేయడం, విష్ణుపురి, అంబూరా, బాలేగావ్ తదితర ప్రాజెక్టులు నిండడంతో ఎస్సారెస్పీలోకి 28,147 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 41.907 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 8,773 క్యూసెక్కుల నీటిని వదులు తున్నారు. కాకతీయ కాలువకు 3,500క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150క్యూసెక్కులు, వరద కాలువకు 3వేల క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360క్యూసెక్కుల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 34.658 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 5.748 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

● స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం ● కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. శ్రావణమాసం ఆదివారం కావడంతో ఇతర ప్రాంతాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు రాజన్నకు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోడెమొక్కు చెల్లించేందుకు భక్తులు సుమారుగా మూడు గంటలపాటుగా బారులు తీరారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతి రాజరాజేశ్వర స్వామి వారలను దర్శించుకుని తరించారు. రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గండ దీపంలో నూనేపోసి గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తెలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి చర్యలు తీసుకున్నారు.


భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ ప్రాంగణం


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ఆకట్టుకున్న అనువంశిక అర్చక కుటుంబాల భజన..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి లక్ష్మీనృసింహస్వామి వారి ఆలయంలో గోపన్నగారి మాధవి ఆధ్వర్యంలో అనువంశిక అర్చక కుటుంబాల మహిళలు చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది.

శ్రావణ మాసం సందర్భంగా అర్చక కుటుంబాల మహిళలు నాంపల్లి లక్ష్మీనృసింహ స్వామి ఆలయానికి తరలివెళ్లారు. స్వామివారిని దర్శించుకుని భజన చేశారు.

మనువాదంతో నరమేధం సృష్టిస్తున్నారు

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

ఓదెల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మత్మోనాదం, మనువాదం, నియంతృత్వంతో అడవుల్లో నరమేధం సృష్టిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో ఆదివారం స్వర్గీయ ఇట్యాల వెంకటయ్య ప్రాంగణంలో ఆరుట్ల రామచంద్రారెడ్డి భవన్ వద్ద ఆదివారం సీనాయర్ నాయకుడు ఆది రామారావు అధ్యక్షతన సీపీఐ మండల పదవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ చెప్పినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, కూడు, గుడ్డ నీడ ప్రజలకు అందించడం లేదని తెలిపారు. నీరవ్ మోడీ, విజయ్‌మాల్యా లాంటి ఆర్థిక నేరస్తులు వేలాదికోట్లు ఎత్తుకెళ్లి విదేశాల్లో ఉంటున్నారని అన్నారు. అలాంటివారిని దేశానికి రప్పించకుండా కర్రిగుట్టలు, దండకారణ్యంలో క్రూరమైన చర్యలకు పాల్పడుతూ ఆదివాసీలు, మావోయిస్టులను చంపివేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు శాంతిచర్చలకు ముందుకు వచ్చినా కూడా ప్రధాని, అమిత్‌షా మొండిగా వ్యవహరించి అడవుల్లో వందలాది మందిని ఎదురు కాల్పుల పేరుతో కాల్చివేశారని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను ఉల్లంఘించి చంపేహక్కు వీరికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. బీసీలకు ఉపయోగపడే రిజర్వేషన్ బిల్లును ప్రధాని, గవర్నర్ అడ్డుకోవడం శోచనీయమన్నారు. జిల్లాలో ఇందిరమ్మ కమిటీల పేరుతో పేదలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంలో బ్రాందీషాపుల ద్వారా రూ.25వేలకోట్ల నుంచి రూ.30వేలకోట్ల ఆదాయం ప్రభుత్వానికి వస్తుందని, ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీలో ఉండాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కలవేని శంకర్, జిల్లాకార్యదర్శి తాండ్ర సదా నందం, డిహెచ్‌పీఎస్ రాష్ట్రనాయకుడు తాళ్లపల్లి లక్ష్మణ్ సమావేశంలో మాట్లాడారు. అనంతరం మండలంలో మూడేళ్లపాటు కార్యక్రమాల నివేదికను కోడం స్వామి చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, కరీంనగర్ టౌన్ కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి కోడం స్వామి, ఆళ్ల చిన్న శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అలుగుపారుతున్న సింగరాయకుంట

● నిండుకుండులా పత్తికుంట చెరువు


మత్తడి దూకుతున్న సింగరాయకుంట

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరాయకుంట, పత్తికుంట చెరువులు నిండుకుండలా కనిపిస్తున్నాయి. రహీంఖాన్‌పేట గ్రామసమీపంలోని సింగరాయకుంట నిండటం వల్ల రహీంఖాన్‌పేట, నారెడ్డిపల్లె, పండలాపురం, కందికట్కూర్ గ్రామాల సమీపం నుంచి మద్యమానేరులోకి నీరు వెళ్తోంది. దీనితో ఈ ప్రాంతాల రైతుల బావుల్లో భూగర్భజలాలు పెరుగనున్నాయి. పత్తికుంటపల్లె గ్రామసమీపంలోని పత్తికుంట చెరువులోకి భారీగా నీరుచేరడంతో మత్తడి దూకుతోంది. చెరువులు నిండటం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎగువ మానేరుకు పెరుగుతున్న వరద

● 25 ఫీట్లకు చేరిన నీటి మట్టం

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు పొంగిపొర్లుతోంది. దీంతో వరదనీరు మానేరు జలాశయంలోకి భారీగా వస్తోంది. మొత్తం 31 ఫీట్ల సామర్థ్యం గల మానేరు నీటి మట్టం ప్రస్తుతం 25 ఫీట్లకు చేరింది. మానేరు మత్తడి దూకేందుకు మరో 6 ఫీట్ల నీరు అవసరం ఉండటంతో ఈ ప్రాంత రైతుల్లో అనందం వ్యక్తం అవుతోంది.


నిండు కుండలా ఎగువ మానేరు జలాశయం

అపరిశుభ్రంగా గోదావరి తీరం

● శివుడి విగ్రహం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం


శివుడి విగ్రహం చుట్టూ ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు


గోదావరి ఒడ్డున ఉన్న చెత్తాచెదారం, చిత్రపటాలు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పవిత్ర గోదావరినది వద్ద ఏర్పాటు చేసిన శివుని విగ్రహం చుట్టూ చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా మారినా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రావణమాసం సందర్భంగా గోదావరి నదికి వందలాది మంది భక్తులు పుణ్యసాన్నాలు ఆచరించడానికి వస్తున్నారు. గోదావరి వద్ద శివుని విగ్రహాన్ని పట్టించుకోకపోవడంతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శివుడి విగ్రహం కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించి విగ్రహానికి రంగులు వేయిం చారు. కానీ విగ్రహం చుట్టూ పాలిథిన్ కవర్లు, దేవుని ఫొటోలతో పేరుకుపోయినా కార్పొరేషన్ అధికారులు తొలగించడం లేదు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానం చేసేందుకు ఏర్పాటు చేసిన మెట్లు కూడా చెత్తపేరుకు పోయింది. కార్పొరేషన్ అధికారులు వంద రోజుల కార్యాచరణ కార్యక్రమాలు అంటూ తూతూమంత్రంగా పనులు నిర్వహించి వెళ్లిపోతున్నారు. అపరిశు భ్రంగా మారిన గోదావరినది స్నానఘట్టాలను, శివుని విగ్రహం చుట్టూ ఉన్న వ్యర్థాలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

మల్లారపు శంకర్‌కు జాతీయ అవార్డు

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామానికి చెందిన హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మల్లారపు శంకర్‌ను బహుజనసాహిత్యఅకాడమీ వారు మహత్మ జ్యోతిబా పూలే జాతీయ అవార్డు 2025క ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదివారం మల్లారపు శంకర్‌కు సాహిత్య అకాడమీ జాతీయఅధ్యక్షులు నల్లా రాధాకృష్ణ అభినందించారు. జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలిపారు. సెప్టెంబర్ 5న తిరుపతిలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 18వ జాతీయ కాన్ఫరెన్స్‌లో అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.


మల్లారపు శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి కాసుల పంట

● మహిళలకు ఉచిత ప్రయాణంతో సంస్థకు ఆదరణ ● రీజియన్ వ్యాప్తంగా రూ.721.35 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కాసుల పంటపండింది. పథకంతో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడం, మహిళలు పెద్దమొత్తంలో ఆర్టీసీబస్సుల్లో ప్రయాణిస్తుండడంతో సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2023 సంవత్సరం డిసెంబరు 9వ తేదీన మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆనాటి నుంచి నేటి వరకు మహాలక్ష్మి పథకం కింద మహిళలు పెద్దసంఖ్యలో ఆర్టీసీ ఆదరిస్తున్నారు. దీంతో సంస్థకు పెద్ద ఎత్తున లాభాలు సమకూరుతున్నాయి.

కరీంనగర్ రీజియన్‌వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖనితో కలుపుకొని 11డిపోలు ఉన్నాయి. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌జిల్లాలో ఆర్టీసీ 244బస్సులను నడిపించి 4.83కోట్లమంది ప్రయాణికుల ద్వారా రూ. 201.82 కోట్ల రూపాయలను ఆర్జించింది. జగిత్యాలజిల్లాలో 194 బస్సులను నడిపించి 5.38 కోట్ల మంది ప్రయాణికులతో 208.62కోట్లరూపాయలు, పెద్దపల్లిజిల్లాలో 136బస్సులతో 3.59కోట్లమంది ప్రయాణికులతో 154.08కోట్ల రూపాయలు, సిరిసిల్లజిల్లాలో 111బస్సులతో 2.87కోట్లమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 113.73కోట్ల రూపాయలు, సిద్దిపేట జిల్లాలో హుస్నాబాద్ డిపోలో 60 బస్సులను నడిపించి 1.26 కోట్ల మంది మహాలక్ష్మి ప్రయాణికులతో 43.11కోట్లరూపాయల ఆదాయాన్ని సంపాదించింది. మొత్తానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో 745 బస్సులను నడిపించి 17.93 కోట్ల మహాలక్ష్మి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చి 721.35 కోట్ల రూపాయల ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్జించింది.

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

డిపో	బస్సులు	ప్రయాణికులు	ఆదాయం
హుజూరాబాద్	64	1.37	56.07
కరీంనగర్-1	87	1.71	60.89
కరీంనగర్-2	93	1.75	84.86
జగిత్యాల	95	2.40	93.07
కోరుట్ల	51	1.52	56.66
మెట్‌పల్లి	48	1.46	58.88
గోదావరిఖని	90	2.70	105.90
మంథని	46	0.89	48.18
సిరిసిల్ల	59	1.33	56.46
వేములవాడ	52	1.54	57.27
హుస్నాబాద్	60	1.26	43.11
రీజియన్ వ్యాప్తంగా	745	17.93	721.35

పార్లమెంట్‌లో బీసీ బిల్లును అడ్డుకుంటున్న బీజేపీ

- సిరిసిల్లలో నిరసన తెలిపిన సీపీఎం నాయకులు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌లో బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం విద్యా, ఉద్యోగ, స్థానికసంస్థల్లో బీసీల రిజర్వేష న్లు పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి ఆర్డినెన్స్‌ను కేంద్రానికి పంపించారన్నారు. కానీ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను ముస్లింల పేరు చెప్పి బిల్లును అడ్డుకుంటోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ల ఆర్డినెన్స్ బిల్లును ఆమోదించి బీసీలపై కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని కోరారు. లేకుంటే బీసీలు తెలంగాణలో బీజేపీకి పుట్టగతులు లేకుండా చేస్తారని హెచ్చరించారు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓబీల ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేస్తామని, ఓబీసీ బడ్జెట్ పెడుతామని ప్రకటించి ఒక్క హామీ కూడా నేరవేర్చలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలకు రిజర్వేషన్లను అమలు చేస్తూనే, తెలంగాణలో మాత్రం ముస్లింలకు రిజర్వేషన్ల అమలును వ్యతిరేకిస్తోందని ఇది బీజేపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని హితవు పలికారు. బీసీలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీ బిడ్డగా బీసీ బిల్లుపై పోరాడాలని మతరాజకీయాలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ, మిట్టపల్లి రాజమౌళి, రాపెల్లి రమేష్, నక్క దేవదాస్, సిరిమల్లె సత్యం, ఒగ్గు గణేష్, ఉడుత రవి, దాసరి రూప, జెజిగం సురేష్, బండి శ్రీనివాస్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో జాతీయభావం పెంపొందించాలి

చందుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో జాతీయ భావం పెంపొందించాలని బీజేపీ జిల్లా నాయకుడు రేగుల మల్లికార్జున్ అన్నారు. చందుర్తి మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ర్యాలీలో భాగంగా మరిగడ్డలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా ద్వారా ప్రజల్లో జాతీయ భావం పెంపొందించాలన్నారు. స్వాతంత్రం కోసం మహనీయులు చేసిన పోరాటాలను స్మరించుకుంటూ, ప్రతీఒక్కరిలో దేశంపై, జాతీయ జెండాపై పౌరుల్లో జాతీయ భావం పెంపొందించేందుకే తిరంగా ర్యాలీ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ పొంచేట్టి రాకేష్, బిజెపి మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, నాయకులు పెరుక గంగరాజు, చిర్రం తిరుపతి, చింతకుంట సాగర్, చింతకుంట గంగాధర్, మల్లేశం, హనుమయ్య చారి, బాలరాజు, బాపురెడ్డి, రాజశేఖర్, తిరుపతి, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● దేశభక్తిని చాటే పార్టీ బీజేపీ

రుద్రంగి (ఆంధ్రజ్యోతి): దేశభక్తిని చాటే పార్టీ బీజేపీ అని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేష్ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కర్దవత్తుల వేణు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయభావం పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ హర్ ఘర్ తిరంగా యాత్రను చేపట్టాలని పిలుపునిచ్చారన్నారు. స్వాతంత్రం కోసం మహనీయులు చేసిన పోరాటాలని స్మరించుకుంటూ వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరిలో దేశం, జాతీయ జెండా పట్ల పౌరులలో జాతీయభావం పెంచే ఆలోచనతో మహనీయుల విగ్రహాలను శుద్ధి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు పడాల గణేష్, బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.


రుద్రంగిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బండి సంజయ్‌ని కలిసిన బీజేపీ నాయకులు

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిశారు. కరీంనగర్‌లో ఆదివారం సంజయ్‌కుమార్‌ను కలిసి సమస్యలపై విన్నవించారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మరుగుదొడ్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నిధులు మంజూరు చేయాలని కోరారు. అసెంబ్లీ కోకన్వీనర్ బత్తిని స్వామి, మండల ప్రధానకార్యదర్శి తిప్పారపు శ్రావణ్, ఉపాధ్యక్షుడు గుంటి మహేష్ బీజేవైఎం అధ్యక్షుడు వి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మున్నూరు కాపు సంఘం మండల కార్యవర్గం

గంభీరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల మున్నూరు కాపు సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేకర్తి భిక్షపతి, ఉపాధ్యక్షులుగా గంద్యాడపు శంకర్, చిట్టంపల్లి అడవయ్య, రామచంద్రం, నాయిని దేవరాజు, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా మల్లేశ్, కోశాధికారిగా ప్రశాంత్, అడ్‌హక్ కమిటీ సభ్యులుగా గంద్యాడపు రాజు, ఎర్ర నర్సయ్య, కొమిరిశెట్టి లక్ష్మణ్, పొన్నాల హన్మండ్లు, రాములు, ఉన్నారు.

నేతాజీ సేవా సమితి కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నేతాజీ సేవా సమితి కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా దినేష్, ఉపాధ్యక్షులుగా వాజీద్, రాము, ఈశ్వర్, ప్రధాన కార్యదర్శులుగా భాను, ప్రవీణ్, విశ్వనాథ్ ఎన్నికయ్యారు. కోశాధికారులుగా అంజి, శ్రీనివాస్, శ్రీనాథ్, అన్వర్, వ్యవస్థ విభాగం ప్రతినిధులుగా రంజిత్‌కుమార్, కళ్యాణ్, కిరణ్, వినయ్, శివ, నవీన్, వినీత్, దేవేందర్, శ్రీనివాస్, భాను, ప్రకాశ్, మహేశ్, రాకేశ్, తిరుపతి, సనత్‌రెడ్డి, అనుదీప్, చందు, సాయికృష్ణ, తేజ, కార్యవర్గ సభ్యులుగా సాయితేజ, అరవింద్, నవీన్, సాయికృష్ణ, ఉదయ్, ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దినేష్ మాట్లాడుతూ మండలంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు నేతాజీ సేవా సమితిని ఏర్పాటు చేశామని అన్నారు. పేద విద్యార్థులు, అభాగ్యులకు అండగా నిలుస్తామని పేర్కొన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

మృతుల కుటుంబాలను పరామర్శ

చందుర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన దికొండ రాజు ఇటీవల క్వారీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందగా, మూడపల్లి గ్రామానికి చెందిన కట్కూరి దేవయ్య, అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు మరాఠి మల్లిక్, చిలుక పెంటయ్య, చిలుక అంజిబాబు, సంటి బాబురావు, ఏనుగుల శ్రీనివాస్, దుమ్మ అంజయ్య, బద్ధం బాపు రెడ్డి, పోతరాజు నగేష్, గంద్ర లక్ష్మణ్ రావు, గొల్లం రాజు, సమీర్ ఉన్నారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన శివశంకర్

- మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని బలహీనవర్గాల అభ్యున్నతికి కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ ఎంతో పాటుపడ్డారని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య అన్నారు. జిల్లా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో పుంజాల శివశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివశంకర్ చిత్రపటానికి బీసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య మాట్లాడారు. కేంద్ర మంత్రిగా శివశంకర్ బలహీన వర్గాల సంక్షేమానికి పాటుపడ్డారని కొనియాడారు. ఏనాడు పదవుల కోసం వేచి చూడలేదని న్యాయవాదిగా తుది దశ వరకు బలహీన వర్గాల పురోగతికోసం పాటుపడ్డారని అన్నారు. శివశంకర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ఇచ్చి గౌరవించాలన్నారు. ఆయన స్మారక పోస్టల్ స్టాంప్ విడదల చేయాలని భారత పార్లమెంట్‌లో ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించాలని డిమాండ్ చేశారు. శివశంకర్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న తెలంగాణ హైకోర్టుకు శివశంకర్ పేరు పెట్టాలని కోరారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శివశంకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, బీసీ నాయకుడు చొప్పదండి ప్రకాష్, బీసీ పట్టణ నాయకులు నీలి శంకర్, అగ్గి రాములు, కల్లూరి రాజు, కల్లూరి మధు, శీలం రాజు, ఇప్పపూల లక్ష్మణ్, ఇప్పపూల రాజు బత్తుల భూమేష్, ఐలి శ్రీనివాస్ నీలి రవీందర్, గుజ్జె రమేష్, ఎర్రం మల్లయ్య, తోట శ్రీనివాస్, కాశెట్టి శ్రీనివాస్, పోకల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్లలో శివశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల పట్టణ సమస్యలపై పోరాటం


అంబికానగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని సిరిసిల్ల బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని 23వవార్డు అంబికా నగర్‌లో ఆదివారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బీజేపీ జెండాను పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను చేపడతామన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక దొరకకుండా ట్రాక్టర్ల యజమానులు కుట్రలు పన్నుతు న్నారని విమర్శించారు. ట్రాక్టర్ ట్రిప్ ఇసుకకు 1,500 రూపాయలు మాత్రమే చెల్లించాలని ఆదేశించినా ట్రాక్టర్ యజమానులు ఒప్పుకోవడం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లను బెసిమెంట్ వరకు నిర్మించుకున్న వారికి ఇంత వరకు డబ్బులను ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నాగుల శ్రీనివాస్, పట్టణ మహిళామోర్చా అధ్యక్షురాలు వేముల వైశాలి, జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధవి, నాయకులు ఊరగొండ రాజు, వేముల సురేష్, మోర శ్రీహరి,అంకారపు రాజు, కైలాస్, చొక్కి శ్రీనివాస్, ఎర్రం విజయ్, గాజుల వేణు, చొప్పదండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం


కిరణ్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నమో మిషన్ వందేమాతరం సంస్థ జిల్లా అధ్యక్షుడిగా కిరణ్‌ను నియమిస్తూ ఆదివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీర మద్విరాజ్ ఆచారి సీపెల్లి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తానన్నారు. సంస్థ జిల్లా అధ్యక్షుడిగా తన నియామకానికి సహకరించిన సంస్థ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సంస్కృతి సంప్రదాయ విలువలను పవిత్రతను చాటడంలో తన వంతు పాత్రను పోషిస్తానని తెలిపారు.

శిలాఫలకాన్ని పట్టించుకోరా?



వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులను ఓ శిలాఫలకం వెక్కిరిస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజన్న ఆలయ విస్తరణ పనుల కోసం రూ. 76 కోట్ల నిధులతో 2024 నవంబరు 20వ తేదిన సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు. రాజన్న ఆలయం ఈశాన్య మూలన ధర్మగుండం సమీపంలో శిలాఫలకం ఏర్పాటు చేశారు. అయితే గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని శిలాఫలకం కనిపించకుండా న్యూస్ పేపర్‌ను అతికించిన అధికారులు ఎన్నికలు ముగిసినా సరిగా తొలగించకపోవడంతో శిలాఫలకం తుప్పుపట్టినట్లు దర్శనమిస్తోంది. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ అధికారులు, ఉద్యోగుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లపై మాటమార్చిన రాష్ట్రప్రభుత్వం

- జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై రాష్ట్రప్రభుత్వం మాటమార్చిందని జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆదివారం మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్, అసెంబ్లీలో తీర్మానం చేసి, ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదం తెలుపడం లేదని పేర్కొంటున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీసీలను మభ్యపెట్టడానికి చేసిన ప్రయత్నాలు విఫలం చెందాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచకపోతే తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 50 సార్లు డిల్లీ వెళ్లిన సీఎం రాష్ట్రానికి ఒక్కరూపాయి కూడా నిధులు తేలేదన్నారు. కాంగ్రెస్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని విమర్శించారు. సమావేశంలో నాయకులు కూనబోయిన రఘు, ర్యాగటి రమేష్, మెరుగు రాజు, బెంద్రం తిరుపతి రెడ్డి, పుట్ట చంద్రశేఖరరెడ్డి, నేరెళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధం వేణు

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కోనరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలోని మురుగునీరు రోడ్డు మీద పారుతోంది. ప్రధాన రహదారి సీసీ రోడ్డు గుంతలమయంగా మారడంతో మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారి సీసీ రోడ్డు గుంతల మయంగా మారింది. ప్రధాన రహదారి వెంట డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగు నీరు అంతా రోడ్డుమీద పారి బురదమయంగా మారుతోంది. ఈగలు, దోమలు ఎక్కువ కావడమే కాకుండా దుర్గంధం వెదజల్లుతోంది. కోనరావుపేట పోలీస్‌స్టేషన్ ఆవరణ నుంచి మండల కేంద్రంలోని అంకంపేట వరకు ఇదే పరిస్థితి ఏర్పడింది. సీసీ రోడ్డు గుంతల మయంగా మారగా అందులోకి మురుగునీరు చేరడంతో అస్తవ్యస్తంగా మారింది. అధికారులు స్పందించి సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించి రోడ్డుపైన మురికి నీరు లేకుండా చూడాలని కోరుతున్నారు.


సీసీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

యూరియాను అందుబాటులో ఉంచాలి

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి

రుద్రంగి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు రాత్రి పగలు తేడాలేకుండా పడిగాపులు కాస్తున్నారని, యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి అన్నారు. రుద్రంగి మండలకేంద్రంలో యూరియా కొరతపై గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 20 రోజులుగా ఎరువుల షాపుల వద్ద రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఒక్క ఆధార్ కార్డుపై ఒక యూరియా బస్తాను ఇవ్వడంతో రైతులు వ్యవసాయ పనులు వదులుకొని షాపుల ఎదుట గంటల కొద్ది బారులు తీరుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం యూరియాను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగం స్వరూప మహేష్, మాజీ ఎంపీటీసీ లావణ్యరాజేశం, చెప్యాల గణేష్, ఉప్పులూటి గణేష్, అల్లూరి గంగారెడ్డి, నాగులపల్లి రవి, దయ్యాల పెద్దులు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

రైతు బీమాకు వేళాయె...

(5వపేజీ తరువాయి)

పాత పట్టాదారుల వివరాలను కూడా రెండో కేటగిరీ కింద 13వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలి. మూడో కేటగిరీ కింద గతంలో రైతు బీమా కింద ఎనిమిదో సంవత్సరం పాలసీలోను కొనసాగే అర్హులైన రైతుల వివరాలను మండల వ్యవసాయ అధికారులు లాగిన్‌లో అందుబాటులో ఉంచాలని, పొరపాట్లు ఉంటే సవరించడంతోపాటు కొత్త వివరాలు ఏమైనా వస్తే వాటిని చేర్చి తిరిగి ఏఈవో లాగిన్‌లోకి పంపాలి. ఈ ప్రక్రియ 12వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఐదెకరాల భూమిపైన ఉన్న రైతులు ఇప్పటివరకు రైతు బీమా పరిధిలోకి రాని వారిని గుర్తించి వారు వివరాలను సైతం 13వ తేదీ నాటికి పోర్టల్‌లో చేర్చాల్సి ఉంటుంది. ఈనెల 14 వ తేదీ వరకు రైతు బీమా పాలసీలు రెన్యువల్ చేయనున్నారు. రైతులు బీమా కోసం తన వివరాలను అందించడానికి రైతు వేదికల వద్ద వ్యవసాయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

● రూ 133.75 కోట్ల బీమా పరిహారం

జిల్లాలో 2018 నుంచి ఇప్పటివరకు బీమా పథకంలో రైతులు నమోదవుతూ వస్తున్నారు. 2024-25 సంవత్సరంలో 80,185 మంది రైతులు నమోదయ్యారు. ఈసారి కొత్తగా ఆరు వేల మంది రైతులు నమోదయ్యే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటివరకు రైతు బీమా ద్వారా 2,675 మంది రైతు కుటుంబాలు బీమా పరిహారం పొందారు. 2018లో 318 మంది, 2019లో 337 మంది, 2020లో 536 మంది, 2021లో 387 మంది, 2022లో 376మంది, 2023లో 385 మంది, 2024లో 336 మంది రైతులు చనిపోగా వారి కుటుంబాలు బీమా సాయాన్ని పొందాయి. ఇప్పటివరకు రూ 133.75 కోట్ల వరకు బీమా పరిహారం పొందారు.

● వ్యవసాయ లెక్కలు ఇలా..

ప్రభుత్వం గతంలో జరిపిన వ్యవసాయ గణాంకాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1,10,883 మంది రైతులకు సంబంధించి 2,43,157.16 ఎకరాల వ్యవసాయ భూమి లెక్కలోకి వచ్చింది. ఎస్సీలకు సంబంధించి 15,219 మంది రైతులకు 25,242.04 ఎకరాల భూమి ఉంది. ఎస్టీలకు సంబంధించి 3,742 మంది రైతులకు 8,769.14 ఎకరాల భూమి ఉండగా ఇతర సామాజిక వర్గాల్లో 91,919 మంది రైతులకు 2,09,627.17 ఎకరాలు ఉంది. 20,879 మంది మహిళ రైతులకు 44,460.15 ఎకరాల భూమి ఉంది.

13లోగా పాలసీ చేసుకోవాలి



- అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రభుత్వం రైతు బీమా పథకం రెన్యువల్ కోసం మార్గదర్శకాలు జారీ చేసింది. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు 13వ తేదీలోగా బీమా పాలసీ కోసం దరఖాస్తులు చేసుకోవాలి. ఇప్పటికే బీమా పథకంలో ఉన్న రైతులు నామినీలు, ఇతర మార్పులు, చేర్పులు ఉంటే వివరాలు అందించాలి. వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండి దరఖాస్తులు తీసుకుంటారు.

రాజన్న ఆలయంలోని పలు విభాగాలకు విరాళాలు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలోని విభాగాలకు పలువురు విరాళం అందజేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన ఆర్తిరెడ్డి రాజన్న ఆలయ గోశాల సంరక్షణ ట్రస్టుకు లక్ష రూపాయలు, రాజన్న ఆలయ నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగి కట్టంగూర్ అందె మహిత రెడ్డి రాజసుదన్‌రెడ్డి, రీధిమరెడ్డి లక్షల రూపాయల విరాళం అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు అశోక్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్ ప్రోటోకాల్ అధికారి శ్రీకాంతచారి, రమాదేవి తదితరులు ఉన్నారు.

వెంకట్రావుపల్లెలో కేసీఆర్ కిట్ల పంపిణీ


కేసీఆర్ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామంలో కేసీఆర్ కిట్లను రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు చెరుకుపల్లి రాజిరెడ్డి పంపిణీ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్‌ఏస్మైల్ కార్యక్రమం కింద ఆదివారం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలనే లక్ష్యంతో మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాన్ని రద్దుచేయడం సరైన విధానం కాదన్నారు. ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వ పథకాలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ ఎంద్ర చందన్, గ్రామశాఖ అధ్యక్షుడు తోటపెల్లి తిరుపతి, నాయకులు ఐరెడ్డి రవీందర్‌రెడ్డి, దుద్దెడ బాలగౌడ్, జెట్టి వెంకటేశం, సొల్లు కనుకయ్య, జెట్టి చంద్రయ్య, జెట్టి నవీన్, నర్సింగోజు శ్రవణ్, యాగండ్ల ప్రశాంత్, పండుగ రాజు, శివప్రసాద్, రామగిరి మధు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడిపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ కిరణ్‌నాయక్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఐ రాహుల్‌రెడ్డికి బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేసిన కేటీఆర్‌పై బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ వ్యాఖ్యలను ఖండించారు. నాయకులు సీత్యానాయక్, శంకర్‌నాయక్, ప్రభునాయక్, పుణ్యానాయక్, కిషన్, తిరుపతినాయక్, తదితరులు ఉన్నారు.



ఎస్ఐ రాహుల్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు